# తెలివైన చేప

ఒక రోజు ఒక చేపలు పట్టేవాడు చేపలు పట్టడానికని నదికి వెళ్ళాడు.అతను తన వలను నీటిలోకి వదిలాడు. చేపల కోసం చూస్తూ అక్కడే కూర్చొని ఆలోచించసాగాడు. ఈ రోజు వచ్చిన చేపలను అమ్మి బాగా డబ్బు సంపాదించాలని అనుకున్నాడు. నీటిలో వేసిన వల కదలడం వలన వలలో చాలా చేపలు పడ్డాయని అనుకున్నాడు. వలను బయటకు తీసి చూసాడు.

కాని అతనికి వలలో ఒక చిన్న చేపపిల్ల మాత్రమే కనిపించింది. దానిని ఒడిసి పట్టుకోవాలని అనుకున్నాడు. వెంటనే చిన్న చేప పిల్ల అతనితో మాట్లాడటం ప్రారంభించింది. ఆ చిన్న చేపపిల్ల చేపలు పట్టేవానితో "ఓ! జాలరి దయచేసి నన్ను వదిలి వేయు. లేకుంటే నేను చనిపోతాను. నేను నీటి బయట బ్రతకలేను" అని అన్నది. కాని ఆ జాలరి చేప మాటలను పట్టించుకోలేదు.

మళ్ళీ ఆ చిన్న చేపపిల్ల జాలరితో " నేను నీకు ఒక పెద్ద సహాయం చేస్తాను.ఒక వేళ నన్ను తిరిగి నీటిలోకి వదిలితే, మీ గురించి మా మితులకు చెప్పి వారందరిని ఇదే నదీ తీరానికి తీసుకవస్తాను. కావున రేపటి రోజు నీవు బాగా చేపలు పట్టుకోవచ్చు"అని అన్నది.

ఆ మాటలు విన్న జాలరి ఇదేదో మంచి ఆలోచనలా ఉంది.ఈ ఒక్క చిన్న చేపపిల్లను ఈ రోజు వదిలి వేస్తే, రేపు నేను చాలా చేపలు పట్టుకోవచ్చు. ఎందుకంటే ఈ చిన్న చేపపిల్ల తన మిత్రులను అందరిని తీసుకొని వస్తుందని ఆ చేప పిల్ల మాటలు నమ్మి జాలరి దానిని తిరిగి నీటిలోకి వదిలివేశాడు.

ఆ చిన్న చేపపిల్ల చాలా సంతోష పడింది.వెంటనే అది నీటిలోకి ఈదుతూ వెళ్ళింది. కానీ మళ్ళీ తిరిగి రాలేదు. పాపం ఆ జాలరి మరుసటి రోజు వచ్చి, బాగా చేపలు పట్టుకోవచ్చని అనుకున్నాడు.కానీ ఆ చేప పిల్ల రాలేదు. ఈ విధంగా తెలివైన ఆ చిన్న చేపపిల్ల తనను తాను జాలరి నుండి కాపాడుకున్నది.

**కథలోని నీతి:-**

ఎంతటి అపాయాన్ని అయిన ఉపాయంతో ఎదురుకోవాలి.

LIVEWORKSHEETS